క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన అక్కాచెల్లెళ్లు


వర్షిణి


వైదేహి

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని గొల్లపేటకు చెందిన అక్కా చెల్లెళ్లు (కవలలు) ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో సత్తా చాటారు. గొల్లపేటకు చెందిన మహంతి వెంకట వర్షిణి , వెంకట వైదేహి ఎంపీసీ విభాగంలో వరుసుగా 464, 465 మార్కులు సాధించారు. వీరి తల్లిదండ్రులు జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, జనార్దనరావు దంపతులు. ఈ మేరకు విద్యార్థినులను పలువురు అభినందించారు.

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం రేపు


డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు ఈ నెల 16న అమరావతిలో ప్రమాణ స్వీకారం చేస్తారని పీఆర్టీయూ ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జి బంకపల్లి శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల చైర్మన్ మోషేన్‌రాజు నుంచి ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. డాక్టర్ గాదె మూడోసారి ఎన్నికైన సందర్భంగా ఆయన ప్రమాణ స్వీకరణానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు 130 కార్లలో బయలుదేరుతారన్నారు.

బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: నెల్లిమర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ గీతా భవానీ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన వినోద్ కుమార్ లల్వానీకి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ జరిగింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ, సతివాడ సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈఈ పి. త్రినాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్ పురం, తుమ్మలపేట, చిన బూరాడపేట, పెద్ద బూరాడపేట, పారసాం, గెద్దపేట గ్రామాలతో పాటు.. గుర్ల మండలంలోని చింతలపేట, భూపాలపురం, ఆనందపురం, తాళ్ల పూడిపేట గ్రామాల్లో.. అలాగే సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభయ్యాయి. తొలిరోజు అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఘటాలు, ప్రభలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ ధర్మకర్త ఆదుర్తి రామకృష్ణ, విజయలక్ష్మి, తేన్నేటి వెంకటరమణమూర్తి, రమణి రేణుక, తోటకూర వెంకటసత్యనారాయణరాజు, భవాని దంపతులతో శివపార్వతుల కల్యాణం జరిపించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం చేస్తున్న ఆలయ ధర్మకర్త తిరుపతినాయుడు,లక్ష్మి దంపతులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు హరికృష్ణమాచార్యులు ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు, భక్తులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం జరిపించి, సాయంత్రం ఉత్సవ విగ్రహాల తిరువీధి నిర్వహించారు. ఊరేగింపులో కోలాటం ఏర్పాటు చేశారు.

రంగు చూసి మోసపోకండి

- నగరంలో ప్రారంభమైన కర్బూజా పళ్ల విక్రయాలు
- కృత్రిమంగా పండించిన పండ్లతో పొంచి ఉన్న అనారోగ్యం


విజయనగరం మార్కెట్‌లో కర్బుజా విక్రయాలు

విజయనగరం: వేసవిలో చల్ల చల్లని కర్బూజా పండ్లను ఎవరికైనా తినాలనిపిస్తుంది. ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు మాత్రమే ఈ పళ్లు మార్కెట్‌లో విరివిగా లభిస్తాయి. దీంతో నగరంలో ఎక్కడ చూసినా ఈ పండ్లను కుప్పలుగా పోసి కేజీల చొప్పున, చిన్న ముక్కలను రూ.10 చొప్పున అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు తోపుడు బండిపై వీటిని అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు. మరికొందరు కొనుగోలుదారులను ఆకర్షించేందుకు పండ్లకు కృత్రిమ రంగును ఇంజెక్ట్ చేసి విక్రయిస్తున్నారు. పెద్ద సైజు కర్బూజ పండ్లను చిన్న ముక్కలుగా చేసి ఒక్కొక్కటి పది రూపాయలు వంతున అమ్ముతున్నారు. ఈ ముక్కలకు ఎండ తగలకుండా, దుమ్ము ధూళి పడకుండా పలుచని వస్త్రం కప్పి ఉంచాలనే విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదు. ఈ ముక్కలు తింటే చల్లదనం మాట పక్కనబెడితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. కర్బూజా పండ్లను కొనుగోలు చేసేటపుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎలాంటి పండ్లను కొనాలి.. కృత్రిమ రంగు కలిపిన పండును ఎలా గుర్తించాలి.. పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని చెబుతున్నారు.

కల్తీ ఇలా పసిగట్టవచ్చు..

- కర్బూజా పండు లోపలి భాగం ఎర్రగా కనిపించడానికి అందులో సహజంగా ఉండే లైకోపినీ (ఎస్ఐసీటీపీఈఎస్ఈ) ఎంజైమే కారణం. సహజ సిద్ధమైన ఎంజైమ్ ప్రభావంతో పండు ఎర్రగా కనిపిస్తుంది.
- అయితే ముక్క ఎక్కువ ఎరుపుగా కనిపించేందుకు కొన్ని రకాలైన రసాయనాలను పండులోకి ఇంజెక్షన్ ద్వారా చొప్పిస్తున్నారు. ఇలా ఇంజెక్ట్ చేసిన పండ్ల పైభాగంలో తెల్లని ధూళి పేరుకుపోయి ఉంటుంది. పండును చేతిలోకి తీసుకుని చూస్తే చేతికి దుమ్ము అంటుకుంటే కల్తీ అని గుర్తించవచ్చు.
- పండును చిన్న ముక్కగా కోసి గ్లాసు నీటిలో వేయగానే నీరు ఎర్ర రంగుగా మారుతుంది. రంగు మారకపోతే అందులో ఎలాంటి కృత్రిమ రంగు, ఇంజక్షన్ చేయలేదని గుర్తించాలి.

కోసిన వెంటనే తినడం ఉత్తమం..

పండును ముక్కలుగా కోసిన 15 నిమిషాల లోపే తినాలి. ఎండకు ఎండిన, గాలికి ఆరిన ముక్కలను ఎట్టి పరిస్థితుల్లో తినకూడదు. ఎక్కువసేపు గాలికి, ఎండలో ఉన్న పండు ముక్కలలోకి గాలిలోని రోగకారక సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉంది. అటువంటి వాటిని తిన్నవారు డయేరియా బారిన పడే ప్రమాదముంది. నాణ్యత కలిగిన పండ్లను కొనుగోలుదారులకు విక్రయించాలి.

– శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు

రక్తదాన శిబిరం..



రక్తదానం ప్రాణదానంతో సమానమని సాహితీ ప్రవంతి సంస్థ కన్వీనర్ చీకటి దివాకర్ అన్నారు. సోమవారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో గాంధీ బ్లడ్‌డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బి.రామారావు, అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

అభినందనలు

బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుంకరవీధి సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలికల వసతిగృహంలో ఉంటూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.కోటకు చెందిన వి. అరుంధతి అంబేడ్కర్‌పై చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. దీంతో ఆమెను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

– విజయనగరం టౌన్



కావాలనే మా స్థలం అడుగుతున్నారు..


గ్రామంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: ఎన్నో ఏళ్ల నుంచి మా అధీనంలో ఉన్న స్థలాన్ని వేరొకరికి ఇచ్చేందుకు అధికార పార్టీ నాయకులు కావాలనే అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని చెరుకుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుజ్జు వెంకటరమణ ఆరోపించారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 70 మంది లబ్ధిదారులకు గ్రామంలో పట్టాలిచ్చారన్నారు. అయితే అప్పట్లో వారికి స్థలాలు చూపించలేదని.. అందులో కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో వారికి స్థలాలు చూపించాలని రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. దీంతో గ్రామంలోని జగన్న కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో వారికి స్థలాలు కేటాయించారన్నారు. ఇటీవల మరో 12 మంది కూడా హైకోర్టును ఆశ్రయించడంతో వారికి స్థలాలు చూపించాలని ఆదేశించిందని తెలిపారు. జగనన్న కాలనీలో వారికి సరిపడా స్థలాలు ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకులు కావాలనే 45 ఏళ్లుగా తమ కుటుంబీకుల అధీనంలో ఉన్న స్థలాన్ని అడుగుతున్నారన్నారు. గ్రామపెద్ద అప్పలనరసయ్య మాట్లాడుతూ.. గ్రామంలో శాంతిభద్రలతలకు విఘాతం కల్పించేందుకే అధికార పార్టీ నాయకులు ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ 12 మందికి గ్రామంలో వేరేచోట స్థలాలు ఇస్తామన్నా.. కావాలని గుజ్జు వెంకటరమణ కుటుంబీకుల అధీనంలో ఉన్న స్థలాన్ని అడుగుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలో అన్ని ఆక్రమణలను తొలగించాలన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ రాయి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్రా ఆనంద్, సరగడ రమేష్‌రెడ్డి, వాకాడ గోవింద, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి పయనం


ప్రమాణ స్వీకారానికి జిల్లా నుంచి బయలుదేరిన బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీవీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏలూరులో మంగళవారం జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొనేందుకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి పలువురు సోమవారం బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో పదవులు పొందిన వారికి అభినందనలు తెలియజేశారు. ఏలూరు బయలుదేరిన వారిలో గన్నవరపు శ్రీనివాస్, కె.సరోజిని, యామిజాల ప్రభ, వీఎస్ఎన్ కుమార్, వాడ్రేవు శ్రీనివాస్(బుజ్జి), బి.రామ్‌కుమార్ శర్మ, మోతడక మురళి, కిరణ్మయి, రాపాక చంద్రశేఖర్, సరిపల్లి శ్రీనివాస్, గంటి మోహన్, పీవీ శాస్త్రి, సుబ్రహ్మణ్యం, దేవీ, లక్ష్మి, తదితరులున్నారు.

గౌరునాయుడుకి సాహితీ పురస్కారం


యువ సాహితీవేత్త గౌరునాయుడుని సన్మానిస్తున్న నిర్వాహకులు, రచయితలు

లక్కవరపుకోట: కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరునాయుడుకి శ్రీశ్రీ కళావేదిక సాహితీ యువ పురస్కారం ప్రదానం చేసింది. కోనసీమ జిల్లా రచయితల సంఘం, అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్తంగా అమలాపురంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసమ్మేళనంలో సామాజిక, సాంస్కృతిక, చైతన్య సాహిత్యం అనే అంశంపై గౌరునాయుడు కవితలు చెప్పి, అభ్యుదయ గేయాలను ఆలపించారు. అభ్యుదయ సాహిత్య వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తూ నిర్వాహకులు పురస్కారం అందించారు. ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ డాక్టర్ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు సీహెచ్.లలిత, ఏపీ తెలుగు అధ్యాపక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, కోనసీమ జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, పార్థసారథి, రమావతి తదితరులు గౌరునాయుడుని సన్మానించారు.

అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు


అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తవలస: మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న అయ్యప్పస్వామి సేవాపీఠంలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడు కలను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం అన్నదానం చేశారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు..

భారత రాజ్యాంగ నిర్మాత, దేశ తొలి న్యాయశాఖా మంత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వాడవాడలా అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రత, లౌకికతత్వం, మత సామరస్యం కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్


విజయనగరం గంటస్తంభం: ఫైనల్‌వీధి జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


డెంకాడ: బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ రమణమూర్తి, తదితరులు


నెల్లిమర్ల రూరల్: సీతారామునిపేట సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్‌లు, నాయకులు


విజయనగరం టౌన్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు పెంకి ఇజ్రాయిల్, తదితరులు


డెంకాడ: అమకాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు


నెల్లిమర్ల రూరల్: గుషిణిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎస్సై గణేష్, తదితరులు


విజయనగరం అర్బన్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు, తదితరులు


భోగాపురం: రెవెన్యూ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్


విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్ నల్లనయ్య, తదితరులు


డెంకాడ: దొడ్డిబాడువలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమ్మినాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనక సింహాచలం, తదితరులు


నెల్లిమర్ల: మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


విజయనగరం టౌన్: నివాళులర్పిస్తున్న రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, తదితరులు


డెంకాడ: డీఆర్‌పాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నిలువెత్తు పూలమాల వేస్తున్న సర్పంచ్ కనకరాజు, తదితరులు


నెల్లిమర్ల : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


పూసపాటిరేగ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు


విజయనగరం గంటస్తంభం: వైఎస్సార్‌నగర్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


విజయనగరం: వైఎస్సార్‌సీపీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న నాయకులు


నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు


నెల్లిమర్ల: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గదల సన్యాసినాయుడు, చిక్కాల సాంబశివరావు, రేగాన శ్రీనివాసరావు, తదితరులు


విజయనగరం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్యవేదిక ప్రతినిధులు


విజయనగరం టౌన్ అంబేడ్క విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న జైభీమ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి దుర్గారావు, తదితరులు